క్లుప్తంగా

డీఎన్నార్ ఎన్నికలకు తొలిరోజు 17 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న గాదిరాజు సత్యనారాయణరాజు

సాక్షి, భీమవరం : భీమవరం డీఎన్నార్ కళాశాల పాలకవర్గ ఎన్నికలకుగాను తొలిరోజు గురువారం 17 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి కె రఘురామ్ చెప్పారు. వీటిలో కార్యదర్శి పదవికి మూడు నామినేషన్లు దాఖలుకాగా మెంబర్స్ పదవులకు 14 నామినేషన్లు వచ్చాయన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశముందన్నారు.

వెంకటపతిరాజు చిరస్మరణీయుడు



వెంకటపతిరాజు జీవన యాత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : విద్యా వైద్య, సహకార రంగాలకు భూములను విరాళంగా అందించిన మంతెన వెంకటపతిరాజు చిరస్మరణీయుడు అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం గుప్తదాత వెంకటపతిరాజు జీవన యాత్ర పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. వారి కుటుంబ సభ్యులు కూడా ఆయన ఆశయాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. మంతెన వెంకటపతిరాజు, మంతెనరామ్ కుమార్ రాజు, ప్రముఖ పిల్లల వైద్యులు వెంపాడు రామకృష్ణంరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, శ్వేత, వి రవికుమార్ రాజు, జి పెదబాబు, కే మేఘ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సువర్ణరాజు మృతి తీరని లోటు



సువర్ణరాజు సంతాప సభ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం : సువర్ణరాజు మృతి తీరని లోటు అని చింతలకోటి గరువు గ్రామ సర్పంచ్ దాసరి మహాలక్ష్మి తెలిపారు. గురువారం నిర్వహించిన సంతాప సభలో సర్పంచ్ మాట్లాడుతూ సువర్ణరాజు వీఆర్వోగా పనిచేస్తూ రైతు సమస్యల పట్ల నిత్యం స్పందించేవారని, ఆయన మృతి బాధాకరమన్నారు. సంతాప సభలో దాసరి మాణిక్యాలరావు, గ్రామస్తులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయేలుకి అభినందనలు



ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయేలుని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లు అర్బన్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన బొమ్మి ఇజ్రాయేలుని పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం అమలాపురంలో కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ గుర్తింపునిచ్చారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవల్లి వాసు అన్నారు. ఇజ్రాయేలుని అభినందించిన వారిలో పట్టణ వార్డు ఇన్‌చార్జ్ రామాంపుల పెదమధు, రామాంజుల చినమధు, ముమ్మిడివరపు ఆంజనేయులు, పి.సునీల్ తదితరులు ఉన్నారు.

వైభవంగా తిల్లపాయిలమ్మ జాతర



జాతరలో అలరించిన కాళికాదేవి, అఘోరాల వేషధారుల నృత్య ప్రదర్శన

పాలకొల్లు అర్బన్: తిల్లపూడిలో గ్రామదేవతలు శ్రీతిల్లపాయిలమ్మ, శ్రీమారెమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కేరళ డప్పు వాయిద్యాలు, కాళికాదేవి, అఘోరాల వేసధారుల నృత్య ప్రదర్శన, తప్పెటగుళ్లు, శక్తివేశాలు, బుట్టబొమ్మలు, గరగల నృత్య ప్రదర్శనలతో జాతర నిర్వహించారు. ముందుగా అమ్మవార్ల ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ నడపన శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి



రీసర్వేపై సమీక్షిస్తున్న భీమవరం ఆర్డీఓ దాసిరాజు



ఏలురుపాడులో భూసర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఆకివీడు: గ్రామాల్లో జగనన్న భూరక్ష భూహక్కు సర్వే మందకొడిగా జరుగుతోందని భీమవరం ఆర్డీఓ దాసి రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వే సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో డ్రోన్ సర్వే ఎనిమిది గ్రామాల్లో పూర్తయిందన్నారు. రికార్డు దాఖలా సర్వే కార్యక్రమాన్ని ఆరు గ్రామాల్లో చేపట్టగా దుంపగడప, పెదకాపవరం గ్రామాల్లో సర్వే నత్త నడకన సాగడంపై అసహనం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాల్లో కూడా అంతంతమాత్రంగానే సర్వే జరుగుతోందన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆయన సూచించారు. వేసవిలోనే సర్వే పూర్తి చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. సర్వే కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, డీఈ వెంకటరమణ, డీటీ రాజకిషోర్, సర్వే డీటీ ఫరూక్, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. తొలుత ఆర్డీఓ రాజు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న కాలనీలో నిర్మాణాన్ని పరిశీలించారు. వేసవి రోజుల్లో నిర్మాణ పనులు వేగవంతం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని డిజిటల్ ఇంజనీర్లకు సూచించారు. నీటి సమస్య తలెత్తకుండా నిర్మాణదారులతో చర్యలు తీసుకోవాలన్నారు.

ఏలూరుపాడులో భూ రీసర్వే

కాళ్ల: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్షా పథకంలో భాగంగా గురువారం ఏలూరుపాడులో డ్రోన్ ద్వారా భూముల సర్వే నిర్వహించారు. సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది, తహసీల్దార్ కాళ్ల టీపీ కృష్ణారావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవ మూర్తిరాజు, వీఆర్వోలు మణి, సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు చిన్నాపరపు రాంబాబు, గ్రామ పెద్దలు, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలివే

భీమవరం అర్బన్ : మండలంలోని గొల్లవానితిప్పలో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం నూతనంగా 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్ల ఏర్పాటు నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. గొల్లవానితిప్ప, ఎల్‌వీఎన్‌పురం, పల్లిపాలెం, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, లోసరి, బరువానిపేట తోకతిప్ప, నాగేంద్రపురం, దెయ్యాలతిప్ప, రామాయణపురం గ్రామాలతో పాటు లోసరి, దిరుసుమర్రు గ్రామాలలో ఇండస్ట్రియల్ లైన్లకు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు

వీరవాసరం : సాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని నేల పోగుల, కొణితివాడ, రాయకుదురు, పంజావేమవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా వంతుల వారీ సాగునీటి విధానానికి సహకరించాలని కోరారు. కొణితివాడ, గవరపాలెం, బుధరాయుడు చెరువు, రాయకుదురు గ్రామాల్లోని శివారు భూములకు సాగునీరు రావడంలేదని రైతులు ఇరిగేషన్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఏఈ వివరించారు.

వ్యాను ఢీకొన్న ఘటనపై కేసు నమోదు

ఆకివీడు: బైక్‌పై గత నెల 17వ తేదీన వెళుతుండగా, వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చెరుకువాడ నుంచి ఆకివీడుకు మోటార్ సైకిల్‌పై వెళుతున్న ముత్యాల శ్రీకృష్ణ సుబ్రహ్మణ్య నరసింహమూర్తిని అజ్జమూరు గరువు ప్రాంతంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వ్యాన్ ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అతని భార్య విజయలక్ష్మి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజారెడ్డి చెప్పారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మేలైన వైద్యం

పాలకోడేరు: ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపుతో గ్రామాల ప్రజలకు మేలైన వైద్యం అందుతుందని గ్రామస్తులంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకోవాలని వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని అన్నారు. కుముదువల్లి గ్రామంలో గురువారం సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగంనాయుడు ఆదేశాలతో కుముదవల్లి వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిరంజని గర్భిణులు, బాలింతలను ప్రత్యేకంగా పరీక్షించి మందుల అందించారు. గ్రామంలో ఉన్న బీపీ, సుగర్ సమస్యలతో వచ్చిన వారికి పరీక్షలు చేసి సలహాలను అందించారు. మహాలక్ష్మి, హెచ్‌వీ నాగమణి, సూపర్‌వైజర్ అయ్యప్ప శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ ఎం.విజయ ప్రసాద్, ఏఎన్ఎం హేమలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఎన్నార్పీ అగ్రహారంలో

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ డీఈవో విజయ్‌కుమార్ చెప్పారు. గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్ వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి వచ్చే రోగులు, గర్భిణులు తప్పకుండా ఆధార్ కార్డును వెంట తీసుకురావాలన్నారు. రోగులను పరీక్షించి నెలకు సరిపడా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

చదువుతోనే బాలికలకు ఉన్నత భవిష్యత్



పాలకోడేరు హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యుడు రంగం నాయుడు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో మహేశ్వరరావు

పాలకోడేరు: బాలికలను రక్షించాలి, బాలికలను చదివించాలి అనే నినాదంతో ప్రతి విద్యార్థిని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. 'బేటి బచావో బేటీ పడావో' అనే నినాదంతో పాలకోడేరు, గొరగనమూడి, కుముదవల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రంగం నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలపై లైంగిక, మానసిక, వివక్షతో కూడిన వేధింపులు జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా పెళ్లి వయసు రాకుండానే వివాహాలు చేస్తున్నారన్నారు. వీటిని నిరోధించాలంటే బాలికలకు చదువే మార్గం అన్నారు. చదువుకున్నప్పుడే బాలికల్లో తెలివితేటలతోపాటు ధైర్యం, ఆత్మస్థైర్యం లభిస్తాయన్నారు. బాలికల చదువుకు, రక్షణకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సీహెచ్‌ఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు శంకర్, అయ్యప్ప శ్రీనివాస్, చండీరాణి, నాగమణి, అమ్మాజీ, హెల్త్ అసిస్టెంట్లు ఎం.విజయప్రసాద్, శ్రీనివాస్, గోపాలకృష్ణ, ఖాన్, సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

సాక్షి, భీమవరం : నేటి సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి మహేశ్వరరావు అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు బాలికోన్నత మునిసిపల్(పీఎస్ఎమ్) పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికల సంరక్షణ, వారికి ఉన్నత విద్యనందించి రక్షణ కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన బాలికలే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తారని మహేశ్వరరావు చెప్పారు. లింగ వివక్షత చూపరాదని, ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీఎస్‌సీ స్టేట్ వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, స్కూల్ హెచ్‌ఎం సుధారాణి, డీహెచ్‌ఈవీ ఎస్ ఆర్‌కే కుమారి, ఎంపీహెచ్‌ఈవో హరివెంకటేశ్వర్లు, హెచ్‌వీ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఎస్ఆర్‌కేఆర్‌లో వర్క్‌షాప్



వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18వ తేదీ నుంచి మూడురోజులపాటు డెవలప్‌మెంట్స్ ఆఫ్ అప్లికేషన్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ వివరాలను వెల్లడించారు. విద్యార్థుల్లో నూతన టెక్నాలజీని అధ్యయనం చేయడం కొత్త సాఫ్ట్‌వేర్స్‌తో అప్లికేషన్ డెవలప్ చేయడం తదితర అంశాలతో వర్క్‌షాప్ ఉంటుందన్నారు. దీంతోపాటు ఈనెల 23వ తేదీన నిర్విరామంగా 24 గంటల పాటు హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో దేశం నలుమూలల నుంచి పలు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వి.చంద్రశేఖర్, జి మహేష్, జీఎస్‌వీ శిరీష పాల్గొన్నారు.

రబీ సాగుకు పూర్తి స్థాయిలో నీరు



కాళ్ల లంకలో వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

కాళ్ల: రబీ సాగుకు పూర్తి స్థాయిలో నీరందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈఈ పీఎస్‌వీవీఎస్ మూర్తి అన్నారు. కాళ్లలో రైతులకు సాగునీరు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అధికారులు కెలంక పంటకాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువ ద్వారా వచ్చే నీటిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రానున్న రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సాగునీరు అందించి వరిపంటకు ఇబ్బందులు లేకుండా చూస్తామని రైతులకు తెలిపారు. అదేవిధంగా కోలనపల్లి వద్ద ఆక్వా చెరువులకు పంటకాలువలో నీటిని తోడుతున్న మోటర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టీపీ కృష్ణారావు, ఇరిగేషన్ ఏఈ ఫణిశంకర్, వీఆర్వో శివనాగరాజు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వినికిడి పరీక్షలు

సాక్షి, భీమవరం : ప్రపంచ హియరింగ్ డే సందర్భంగా భీమవరం తేజ హియరింగ్ క్లినిక్ లో శుక్రవారం ఉచిత వినికిడి పరీక్షల మెగా క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కె దుర్గాప్రసాద్ గురువారం విలేకరులకు చెప్పారు. వినికిడి సమస్యను అశ్రద్ధ చేయవద్దని 6 నెలలకు ఒక్కసారైనా వినికిడి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వివరాలకు 93935 32329 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బస్సు కోసం వేచి చూస్తూ..

సాక్షి, భీమవరం : టూటౌన్‌లోని పాతబస్టాండ్ సమీపంలో గురువారం ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్సై పి.అప్పారావు తెలిపారు. ఫిట్స్ రావడంతో చేతిలో తాళాలు ఉంచారని స్థానికులు తెలిపారన్నారు. కొద్దిసేపటికి నోటి నుంచి నురగలు వచ్చి అతను మృతి చెందాడన్నారు. స్థానికుల సమాచారం ప్రకారం దూబచర్ల వెళ్లే బస్సు కోసం వేచి చూస్తున్నట్లు తెలిసిందని, వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం



శ్రీజ్ఞాన మోక్ష సాయి మందిరం వార్షికోత్సవంలో నిర్వాహకులు, భక్తులు

పాలకోడేరు: కుముదవల్లిలోని శ్రీ జ్ఞానమోక్ష సాయి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు, వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత విఘ్నేశ్వర, పూజ వివిధ నదీజలాలతో 108 కలశాలతో వరుణ పూజ, గ్రామ ప్రదక్షిణం కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం హారతి, అన్న సమారాధన, సంధ్యా హారతి, సాయంత్రం పల్లకి సేవ, రాత్రి సాయి నామసంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వేగేశ్న రామచంద్రరాజు, అనురాధ దంపతులు, అర్చకులు వంశీ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు సీఐగా రాంబాబు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ సీఐగా డి.రాంబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన రాంబాబు కోరుకొండలో ఆర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి అర్బన్ స్పెషల్ బ్రాంచ్, ఏజీఎస్ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేసి పదోన్నతిపై పోలీస్ కంట్రోల్ రూమ్‌లో అనంతరం రాజమండ్రి క్రైం బ్రాంచ్, కడియం సీఐగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

నేటి నుంచి జాతీయ సమైక్యతా శిబిరం



బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

నరసాపురం: వైఎన్ కళాశాలలో శుక్రవారం నుంచి 9వ తేదీ వరకూ వారం రోజులపాటు జాతీయ సమైక్యతా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ చెప్పారు. గురువారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమం బ్రోచర్ విడుదల చేసి వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, జాతీయ సేవా పథకం ప్రాంతీయ కన్వీనర్, వైఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహిస్తున్నారు. జాతీయ సేవా పథకం ప్రాంతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ 12 రాష్ట్రాలకు చెందిన 212 మంది విద్యార్థులు, జాతీయసేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్లు శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. సేవా తత్పరత, శ్రమ దానం, వివిధ రాష్ట్రాల ఆచార వ్యవహాలు, భాష, సంప్రదాయాలు, సంస్కృతులు, సమాజ అభివృద్ధికి తోడ్పడే తత్వం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇలాంటి కార్యక్రమానికి ఈ ఏడాది ఆతిథ్యం ఇచ్చే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం తమ కళాశాలకు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, సబ్‌కలెక్టర్ సూర్యతేజలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

వరిలో సుడిదోమకు నివారణ చర్యలు

తణుకు టౌన్: వరిలో సుడిదోమ నివారణకు చర్యలు చేపట్టాలని ఏఓ కే కుసుమ చెప్పారు. గురువారం కొమరవరంలో నిర్వహించిన పొలం బడిలో భాగంగా ఆమె వరి పొలాలను పరిశీలించి సుడిదోమను గుర్తించారు. దీని నివారణకు పైమెట్రిడిజెన్ 150 మిల్లీ మందు లేదా పెక్సాలాన్ మందు 200 మిల్లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి 1 ఎకరానికి పిచికారి చేయాలని చెప్పారు. పంటలో మిత్ర పురుగులు, శత్రు పురుగులపై వివరించారు. రైతులకు ఉపయోగపడే మిత్ర పురుగులకు విష ప్రభావం లేకుండా చూడాలని కోరారు. ఏఈవో టీ వీరభద్రరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

అత్తిలి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.కె నాగరాజు, ఆర్ సురేఖ అన్నారు. గురువారం అత్తిలి ఎస్వీఎస్ఎస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. ఆడపిల్లలను రక్షించు, ఆడపిల్లలను చదివించు కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ గుమ్మడి హరినాథ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందానికి అమ్మాయిలే అని అన్నారు. సీహెచ్‌వో డి మురళీ, హెచ్‌ఈ కేవీఎస్ఎన్ ప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్ సుధారాణి, డి సూర్యరేఖ పాల్గొన్నారు.

అలుగులమ్మకు నైవేద్యాలు

ఉండి: చెరుకువాడలో వేంచేసియున్న అలుగులమ్మ అమ్మవారి 104వ వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతర ముగింపు కార్యక్రమాల సందర్భంగా అమ్మవారికి గ్రామ పెద్దలు, నిర్వాహకులు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే జాతర ముగింపు సందర్భంగా ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అలుగులమ్మ గద్దె వద్ద ఆలయ ప్రాంగణంలో భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అలుగులమ్మ తీర్థప్రసాదాలు స్వీకరించాలని సర్పంచ్ కోరారు. అలాగే ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు నిర్వాహక కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు.

ఆక్వా రైతులు నిబంధనలు పాటించాలి

సాక్షి, భీమవరం : ఆక్వా రైతులు నిబంధనల ప్రకారం సాగు చేసుకోవాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎల్ఎన్ రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరిసాగుకు ఉపయోగించే నీటిని విద్యుత్ మోటార్ల ద్వారా ఆక్వా చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమంగా ఆక్వా చెరువులకు నీటిని మళ్లిస్తే మోటార్లను సీజ్ చేస్తామన్నారు. అలాగే ఆక్వా చెరువుల్లోని మురుగునీటిని మురుగుబోదెలు, కాలువల్లోకి మాత్రమే విడుదల చేయాలని, పంట కాలువలోకి విడుదల చేస్తే ఆక్వా సాగు అనుమతిని రద్దు చేస్తామన్నారు. మండల ,గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలోని అధికారులు నిత్యం పంట కాలువలోని నీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటారన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: 'కమ్మేస్తున్న డంపింగ్ యార్డ్ పొగ' శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనంతో మునిసిపల్ కమిషనర్ బిఆర్ఎస్ సారధి స్పందించారు. గురువారం స్థానిక రామయ్య హాలు వద్ద ఉన్న డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించారు. రోడ్డుపై వేసిన చెత్తను చూసి శానిటరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ రిజర్వ్ స్థలాల్లో డంపింగ్ యార్డులో ఉన్న మట్టిని వేసి పూడ్చాలన్నారు. దీనికి ఎస్టిమేషన్ తయారు చేయాలని వారం రోజుల్లో పను ప్రారంభించాలని శానిటరీ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీర్ సాంబశివుడు, టీపీఓ వీరబ్రహ్మం, ఆర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ కల్యాణోత్సవాలు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యుత్ దీపాలంకరణలతో, పూల అలంకారాలతో అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభించారు. రాత్రి 7.45 గంటలకు దాసిరెడ్డి శ్రీనివాసరావు వరలక్ష్మీ దంపతులతో అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం రాత్రి 7.29 గంటలకు అమ్మవారి కల్యాణం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.